
ప్రజాశక్తి
శనివారం 24 మే 2025
5
పార్వతీపురం మన్యం



వర్షానికి కూలిన ఇంటి గోడ



గోడ కూలిపోయిన ఇల్లు

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

మండలంలో గురువారం కురిసిన భారీ వర్షానికి ఇంటి మట్టి గోడ కూలిపోయింది. ఎల్విన్ పేట పంచాయతీ దోకులగూడకు చెందిన మండంగి జగ్గయ్య ఇంటి గోడ, పై కప్పు రేకులు వర్షానికి కూలిపోయినట్లు తెలిపారు. ఇంటిలో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడిసి పోయాయన్నారు. గోడ బయట వైపు కూలడంతో ప్రాణాపాయం తప్పిందని, ప్రాణాలతో బయటపడ్డామని పేర్కొన్నారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బంది గ్రామానికి వెళ్లి ఆస్తి నష్టంపై అంచనా వేశారు.

విద్యుత్ కష్టాలకు బాధ్యులపై చర్యల్లేవా?

- ప్రజాగ్రహానికి రాజకీయ రంగు పులిమే యత్నం
- పాత ట్రాన్స్‌ఫార్మర్లు బాగుచేసి అమర్చారనే ఆరోపణలు
- ఎసిలు వాడతారని ట్రాన్స్‌కో అధికారులకు తెలియదా?



మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం

15 ఏళ్ల తర్వాత వచ్చిన శ్యామలాంబ పండగను ఎంతో ఆనందంగా చుట్టాలు, స్నేహితులతో జరుపుకోవాలని భావించిన సాలూరు పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. లక్షలాది భక్తులు హాజరైన పండగ రోజుల్లో నిరంతర విద్యుత్ సరఫరా చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణితో సహా ట్రాన్స్‌కో అధికారులు గట్టిగా చెప్పారు. నియోజకవర్గ ఎమ్మెల్యేగా, మంత్రిగా సంధ్యారాణి చెప్పారంటే అమలు జరుగుతుందని పట్టణ వాసులు బలంగా నమ్మారు. ఆ నమ్మకంతోనే సుదూర ప్రాంతాల్లో ఉన్న చుట్టాలు, స్నేహితులకు పెద్ద ఎత్తున పండగకు ఆహ్వానించారు. పట్టణ పరిధిలో సుమారు 1500 కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో కుటుంబానికి సగటున పండగకు బంధువులు వచ్చినా లక్షా 50వేల నుంచి 2లక్షల వరకు భక్తులు హాజరయ్యారని అంచనా వేస్తున్నారు. దాదాపు దశాబ్దన్నర తర్వాత వచ్చిన పండగ కావడంతో ఐదు లక్షల వరకు భక్తులు హాజరవుతారని మొదట్లో ఉత్సవ కమిటీ, అధికారులు అంచనా వేశారు. అయితే ఆశించిన స్థాయిలో జనం రాకపోయినా వచ్చిన వారికి తగు రీతిలో గౌరవమర్యాదలు చేయలేకపోయామనే ఆవేదన, బాధ పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతోంది. పండగ మూడు రోజుల పాటు విద్యుత్ సరఫరా లేకపోతే ప్రజలు ఎంతగా ఇబ్బందులకు గురవుతారనేది స్పష్టమయింది. జనం ఎదుర్కొన్న బాధలు, కష్టాలే వారిని రోడ్ల మీదకు ఉసిగొల్పాయనేది రుజువైంది.

ఆందోళనలకు రాజకీయ రంగుపులిమే యత్నం

తాము ఎదుర్కొంటున్న కరెంట్ కష్టాల నుంచి బయట పెట్టాలని కోరుతూ ప్రజలు స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. ఈ ఆందోళన కార్యక్రమాల్లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. జనసేన పార్టీ కౌన్సిలర్ రాపాక మాధవరావు ఆధ్వర్యాన ఆ వార్డుకు చెందిన ప్రజలు రాస్తారోకో చేపట్టారు. అయితే ప్రజలు చేసిన ధర్నాలు, రాస్తారోకోల వెనుక ప్రతిపక్ష పార్టీ నాయకుల ప్రమేయం వున్నదనే ప్రచారానికి అధికారపార్టీ నాయకులు, కార్యకర్తలు తెరలేపారు. ప్రజాగ్రహానికి రాజకీయ రంగు పులిమే ప్రయత్నం చేస్తున్నారు.

ఎసిలు వాడతారని అధికారులకు తెలియదా?

ప్రతిష్టాత్మక శ్యామలాంబ పండగ నేపథ్యంలో ఇంటికి వచ్చిన అతిథులకు గౌరవ మర్యాదలు చేయాలని మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి ప్రజలు భావిస్తారు. దీనిలో భాగంగానే పట్టణ ప్రజలు ఎక్కువ ఇళ్లకు ఎసిలు బిగించారు. అంతేకాకుండా పండగ సందర్భంగా పిండివంటలు వండుకోడానికి గ్రైండర్లు కూడా వినియోగిస్తారు. పండగ నేపథ్యంలో వీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు ముందుగా ఊహించి వుండాలి. పట్టణ ప్రజల అవసరాలకు అనుగుణంగా తగిన సామర్థ్యం కలిగిన ట్రాన్స్ ఫార్మర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ట్రాన్స్ ఫార్మర్లు మూడు రోజుల ముచ్చటలా కాలిపోవడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల అంచనాలు తప్పయ్యాయా, నాణ్యత లేని ట్రాన్స్ ఫార్మర్స్ బిగించారా అనేది చర్చ జనంలో నడుస్తోంది.

బాధ్యులపై చర్యలేవీ ?

పండగ రోజుల్లో ప్రజలను నరక యాతనకు గురి చేసిన విద్యుత్ సరఫరాలో అంతరాయానికి బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. అధికారులపై చర్యలు తీసుకోకుండా అదృశ్యశక్తులెవరో అడ్డుకుంటున్నారనే గుసగుసలు మొదలయ్యాయి. సాక్షాత్తూ మంత్రి సంధ్యారాణి పర్యవేక్షణలో జరిగిన పండగ ఏర్పాట్లలో వైఫల్యానికి బాధ్యులపై చర్యలు తీసుకుంటారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. కానీ ఇంతవరకు జిల్లా కలెక్టర్ గానీ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు గానీ ఆ దిశగా అడుగులు వేస్తున్న దాఖలాల్లేవు.

అమర్చిన ట్రాన్స్ ఫార్మర్లు నాణ్యమైనవేనా?

పండగకు లక్షలాదిమంది భక్తులు హాజరవుతారని భావించిన అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత వుంది. పండగ నేపథ్యంలో పట్టణంలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం రూ.1.24 కోట్లతో కొత్త ట్రాన్స్ ఫార్మర్లు, స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు చెప్పారు. మంత్రి సంధ్యారాణి కూడా ఈ విషయాన్ని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పండగను ప్రజలు ఎంతమంది బంధువులనైనా ఆహ్వానించుకోవచ్చునని, నిరంతర విద్యుత్ సరఫరా చేయనున్నామని ఆమె చెప్పుకొచ్చారు. 160 కెవిఎ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు 5, వంద కెవిఎ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు 14, రెండు సింగిల్ ఫేజ్ 16కెవిఎ ట్రాన్స్ ఫార్మర్లతో పాటు స్తంభాలు కూడా ఏర్పాటు చేశారు. అయితే పండగ మూడు రోజుల్లో ఐదు 100 కెవిఎ ట్రాన్స్ ఫార్మర్లు, మూడు 40 కెవిఎ ట్రాన్స్ ఫార్మర్లు, రెండు సింగిల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్లు కాలిపోయాయి. ఓవర్ లోడ్ కారణంగా ఈ ట్రాన్స్ ఫార్మర్స్ కాలిపోయాయని, పట్టణ వాసులు ఎక్కువగా ఎసిలు, గ్రైండర్లు వినియోగించడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడిందని ట్రాన్స్ కో అధికారులు చెబుతున్నారు. అయితే ఇంత పెద్ద ఎత్తున ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోవడానికి ప్రధాన కారణం అవి పాతవి బాగుచేసి అమర్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్త ట్రాన్స్ ఫార్మర్లు అయితే ఎందుకు తొందరగా పాడవుతాయనే అభిప్రాయాన్ని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలకు వాడిన కేబుల్ వైర్లు కూడా నాణ్యమైనవేనా అనే వాదనలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తూ మంత్రి సంధ్యారాణి ఆదేశాల మేరకు నిరంతర విద్యుత్ సరఫరా కోసం ట్రాన్స్ కో అధికారులు చేపట్టిన చర్యల్లో ఇంత డొల్లతనం బయటపడిందంటే వారి వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. సరఫరా చేసిన కాంట్రాక్టర్‌తో అధికారులు లాలూచీ పడటం వల్లనే నాణ్యత లేని ట్రాన్స్ ఫార్మర్స్, కేబుల్ వైర్లు సరఫరా చేశారనే ప్రచారం జోరుగా సాగుతోంది. రూ.కోటీ 24 లక్షలతో కొనుగోలు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మూడు రోజులకే కాలిపోయాయంటే అవి లోపభూయిష్టంగా వున్నాయనేది స్పష్టమవుతోంది.



వేసవి దుక్కు దున్నుతున్న రైతు

విస్తృతంగా వర్షాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా మన్యం జిల్లాలో విస్తృతంగా వర్షాలు కొరవడంతో పాటు గురువారం రాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసినప్పటికీ పాలకొండ డివిజన్ పరిధిలోని మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదు కాగా పార్వతీపురం డివిజన్లో వర్షాలు ఎక్కువగా కురిసినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. శుక్రవారం ఉదయం వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 208 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లా సగటు 13.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. వీరఘట్టంలో 14.8 మిల్లీమీటర్లు, సీతంపేట 10.6, భామిని 7.4, పాలకొండ 3.4, కొమరాడ 20.8, గుమ్మలక్ష్మీపురం 9.6, కురుపాం 10.8, జిఎంవలస 12.6, గరుగుబిల్లి 4.2, పార్వతీపురం 35.6, మక్కువ 33.0, సీతానగరం 15.8, బలిజిపేట 3.8, సాలూరు 6.2, పాచిపెంట 19.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా పార్వతీపురం 35.6, అత్యల్పం గరుగుబిల్లిలో 4.2 నమోదయినట్లు అధికారులు వివరాలు అందజేశారు. రాబోయే రెండు రోజుల్లో జిల్లాలో విస్తృతంగా వర్షాలు ఉంటాయని, అక్కడక్కడ పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాలకు వెళ్లే రైతులు, ఉపాధి వేతనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరుతున్నారు. అయితే గత 15 రోజులుగా చెదురు ముదురుగా కురుస్తున్న వర్షాలు దుక్కులకు అనుకూలంగా ఉండడంతో రైతులు తమ పొలాల్లో దుక్కులు సాగిస్తున్నారు. ఈ ఏడాది రుతుపవనాలు కూడా అనుకూలంగా ఉంటాయన్న ముందస్తు సమాచారంతో అన్ని గ్రామాల్లోనూ రైతులు నారు వేసుకునేందుకు మళ్లను సిద్ధం చేసుకుంటున్నారు. గత నాలుగు రోజులుగా మండలాల్లోని ఏ గ్రామాల్లో చూసినా పొలాల్లో దున్నే సన్నివేశాలు కనిపిస్తున్నాయి. రుతుపవనాల రాకను దృష్టిలో పెట్టుకొని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ 15 రోజులు ముందుగానే ప్రారంభమవుతున్న దృష్ట్యా, వ్యవసాయ అధికారులు విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయదారులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా అధికారులను సంప్రదిస్తే ఈ ఏడాది రైతులకు అవసరమైన మేలి రకం విత్తనాలను సిద్ధం చేశామని, అలాగే ఎరువులను కూడా సిద్ధం చేసి రైతుసేవా కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

రైతుబజార్లలో పైనాపిల్ అమ్ముకొనే అవకాశం

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ పిఒ ఆదేశాల మేరకు పైనాపిల్ సింహాచలం రకం పండిస్తున్న రైతులు శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో గల రైతు బజార్లో పైనాపిల్ పండ్లు అమ్ముకొనుటకు అవకాశం కల్పిస్తామని ఐటిడిఎ పిహెచ్ఒ ఎస్.వెంకట గణేష్ తెలిపారు. కావున ఆసక్తి కలిగిన గిరిజన రైతులు, సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు రైతు బజార్లలో అమ్ముకొనేందుకు అనుమతి కోరుతూ ఐటిడిఎ ఉద్యాన శాఖను సంప్రదించాలన్నారు.

వ్యక్తిగత దూషణలతో బడ్జెట్ సమావేశం


- కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం
- వైసిపి కౌన్సిలర్‌ను సమావేశం నుండి బయటకు తీసుకువచ్చిన పోలీసులు
- నిరసనగా గేటు ముందు బైఠాయించిన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఎట్టకేలకు శుక్రవారం చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి అధ్యక్షతన ప్రారంభమైంది. కౌన్సిల్ బడ్జెట్ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి ముందుగానే పోలీసులు మున్సిపల్ కార్యాలయం ప్రాంగణానికి చేరుకోవడం విశేషం. ఈ బడ్జెట్ సమావేశం ప్రారంభానికి ముందుగానే వైసిపి నుంచి ఇటీవల టిడిపిలో చేరిన 24వ వార్డు కౌన్సిలర్ మంత్రి రవికుమార్, 25వ వార్డు వైసిపి కౌన్సిలర్ నిమ్మకాయల సుధీర్ ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలకు దిగడంతో సమావేశ మందిరంలో కొంత రసాభసా జరిగింది. దీంతో అధికారులు కొంత అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. సమాచారం తెలుసుకున్న పట్టణ సిఐ మురళీధర్, ఎస్ఐ గోవింద తమ సిబ్బందితో ఇరువురి కౌన్సిలర్లను వ్యక్తిగత దోషణలకు దిగవద్దని సూచించడంతో కొంత సద్దుమణిగింది. బడ్జెట్ అజెండాను మున్సిపల్ ఉద్యోగి చదివి వినిపిస్తుండగా, మళ్లీ ఈ ఇద్దరి మధ్య వాగ్వివాదం జరగడంతో వైసిపి కౌన్సిలర్ నిమ్మకాయ సుదీర్‌ను పోలీసులు సమావేశ మందిరం నుంచి బయటకు పంపించారు. దీంతో 2025-26 సంవత్సరానికి బడ్జెట్‌ను ఆమోదించి కౌన్సిలర్ సుధీర్‌ను పోలీసులు తీసుకెళ్లడానికి నిరసనగా చైర్‌పర్సన్‌తో పాటు వైసిపి కౌన్సిల్ సభ్యులు సమావేశం నుంచి బయటకు వచ్చి మున్సిపల్ కార్యాలయం గేటు ముందు బైఠాయించారు. కమిషనర్, టిడిపి కౌన్సిలర్ల తీరుపై నినాదాలు చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేష్, పలువురు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, మేనేజర్ లక్ష్మి, ఆర్వో రూబెన్, డి శ్రీనివాసరాజు, టిపిఒ ప్రమీల రాణి, ఎఇలు, ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.



వాగ్వివాదం చేసుకుంటున్న టిడిపి, వైసిపి కౌన్సిలర్లు



పోలీసుల తీరుకు నిరసనగా మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

సైకో జగన్‌లాగే మున్సిపల్ చైర్మన్ : ఎమ్మెల్యే

మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి అచ్చం సైకో జగన్‌లాగే వ్యవహరిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆరోపించారు. మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. పది రోజుల్లో జరగనున్న ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ పండగ ఏర్పాట్లు కోసం ప్రత్యేకంగా మున్సిపల్ సమావేశం నిర్వహించగా, సభాధ్యక్షులుగా ఉన్న చైర్‌పర్సన్ పండగ అంశాలను కనీసం ప్రస్తావించకుండా అడ్డుకున్నారని విమర్శించారు. సభ జరుగుతుండగానే మధ్యలోనే లేచి వెళ్లిపోయి సభను అగౌరపర్చారని దుయ్యబట్టారు. చైర్మపర్సన్‌తో పాటు ఆ పార్టీ కౌన్సిలర్లకు పార్వతీపురం అభివృద్ధి చెందడం ఏ మాత్రం ఇష్టం లేనట్టుగా కనిపిస్తోందని ఆరోపించారు. వైసిపి అధినేత జగన్ కూడా ఇలాంటి వ్యవహార శైలి తోనే కేవలం 11 సీట్లకే పరిమితమయ్యారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు స్థానిక వైసిపి నాయకులకు కూడా అదే గతి పడుతుందని హెచ్చరించారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిఎం వెంకటరమణ

10నాటికి గృహ నిర్మాణాలు సిద్ధం కావాలి

హౌసింగ్ జిఎం వెంకటరమణ

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పేదల కోసం నిర్మించే గృహాలన్ని జూన్ 10 నాటికి సిద్ధం చేయాలని గృహ నిర్మాణ సంస్థ జనరల్ మేనేజర్, మూడు జిల్లాల హౌసింగ్ ప్రత్యేక అధికారి వెంకటరమణ ఇంజినీర్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో హౌసింగ్ ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 10 నాటికి రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల గృహాలను సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనిపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, కావున దీనిపై ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. ఋుహ నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, స్టీల్, ఇతర సామాగ్రికి కొరత లేదని, అలాగే నీటి సౌలభ్యం లేకపోతే వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే లబ్ధిదారులను ఉత్తేజపరచి ముందుకు వచ్చేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గృహ నిర్మాణాల బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లింపులు జరుగుతున్నాయని, ఇటువంటి తరుణంలో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని వివరించారు. ఎట్టి పరిస్థితిల్లో వచ్చే నెల 10 నాటికి పూర్తి కావాల్సిందేనని తేల్చి చెప్పారు. సమావేశంలో కెఆర్ఆర్సీ ప్రత్యేక ఉప కలెక్టర్, హౌసింగ్ పీడీ డా.పి.ధర్మచంద్రా రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పార్వతీపురం మండలం నర్సిపురంలో లేఅవుట్‌ను పరిశీలించిన ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. త్వరగా ఇళ్ల పనులు పూర్తి చేయాలని కోరారు.



జర్నలో మలేరియా బాధితులతో మాట్లాడుతున్న డిడి రామనాథరావు

ప్రతి మలేరియా కేసుకూ చికిత్స అందించాలి

డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మన్యంలో ప్రతి మలేరియా కేసు చికిత్స జరిగేలా చూడాలని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని దుడ్డుఖల్లు పిహెచ్‌సి పరిధిలో గల జర్నలో ఇటీవల మలేరియాగా గుర్తించిన కేసులను కలిసి వారికి క్షేత్ర స్థాయిలో అందిస్తున్న చికిత్స గురించి ఆరా తీశారు. మలేరియా బాధితులను ప్రత్యక్షంగా కలిసి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. దుడ్డుఖల్లు పిహెచ్‌సి ల్యాబ్‌ను తనిఖీ చేసి వైద్యాధికారి ప్రవీణ్‌ను జ్వరాల అదుపునకు తీసుకుంటున్న చర్యల గురించి చర్చించారు. అనంతరం రేగిడి పిహెచ్‌సిలోని పెంగువ గ్రామాన్ని సందర్శించి అక్కడ దోమల లార్వా ప్రదేశాలను గమనించి సిబ్బందికి ఫ్రైడే డ్రైడే ప్రాధాన్యతను వివరించారు. అనంతరం రేగిడి పిహెచ్‌పి ల్యాబ్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, సహాయ అధికారి సూర్యనారాయణ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కురుపాం : ప్రతి మలేరియా కేసుకు చికిత్స జరిగేలా వైద్య సిబ్బంది చూడాలని మలేరియా డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు అన్నారు. స్థానిక సిహెచ్‌సిని ఆకస్మికంగా ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడి మలేరియా కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మలేరియా బారిన ప్రజలు పడకుండా ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి వై.మణి, సహాయ అధికారి సూర్యనారాయణ, వైద్యాధికారి మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకసారి కాదని... మరోసారి ఔనని

- డిఇఒ నియామకంలో కలెక్టర్ ఉత్తర్వులు
- ఇన్‌ఛార్జి డిఇఒగా డిప్యూటీ డిఇఒ రాజ్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లా విద్యాశాఖాధికారిగా మార్చి31న ఎన్.తిరుపతి నాయుడు ఉద్యోగ విరమణ చేశారు. ఆయన తర్వాత డిఇఒ ఎవరన్న దానిపై చర్చ జరిగింది. వెంటనే సాలూరు మండలం రెగ్యులర్ ఎంఇఒ, ఇంఛార్జి డిప్యూటీ డిఇఒ రాజ్ కుమార్‌ను ఇంఛార్జి డిఇఒగా నియమిస్తూ కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇంఛార్జి డిప్యూటీ డిఇఒని ఇంఛార్జి డిఇఒగా నియమించడం నిబంధనలకు విరుద్ధమని ఉపాధ్యాయ సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయనే నెపంతో కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న ఎడి రమాజ్యోతిని ఇంఛార్జి డిఇఒగా నియమించారు. ప్రస్తుతం ఆమె ఇంఛార్జి డిఇఒగా కొనసాగుతున్నారు. అయితే మళ్లీ ఏం ఒత్తిడి వచ్చిందో తెలియదు గాని కాదనుకున్న డిప్యూటీ డిఇఒ రాజ్ కుమార్‌నే మళ్లీ ఇంఛార్జి డిఇఒగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. అప్పుడు రాజ్ కుమార్‌ను ఎందుకు తిరస్కరించారో? ఇప్పుడు ఎందుకు ఇంఛార్జి డిఇఒ గా నియమించారో అర్థం కావడంలేదు. నిబంధనలకు విరుద్ధంగా మొదటి సారి, రెండోసారి రాజ్ కుమార్‌ను డిఇఒగా నియమించడం వెనుక రాజకీయ ఒత్తిళ్ల వున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. రాజ్ కుమార్ కన్నా సీనియర్ అధికారులు జిల్లా విద్యాశాఖలో వున్నప్పటికీ ఆయననే మళ్ళీ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. జిల్లాకు కీలకమైన అధికారపార్టీ నేత ఒత్తిడి కారణంగా నే నిబంధనలకు విరుద్ధంగా కలెక్టర్ ఇంఛార్జి డిఇఒగా రాజ్ కుమార్‌ను నియమించారనే చర్చ జరుగుతోంది.

గిరిజనులకు సాగుపట్టాలు మంజూరు చేయాలి

ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన పాదయాత్ర

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని కుడుమూరు 48 సర్వే నెంబర్ 782 ఎకరాలు సాగులో ఉన్న గిరిజనుల భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర జరిగాయి. ఈ పాదయాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్‌వై నాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు సూకూరు అప్పలస్వామి ఆధ్వర్యంలో పాదయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్వై నాయుడు మాట్లాడుతూ తాతల కాలం నుంచి సాగు చేస్తున్న ఈ భూములకు పట్టాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు సర్వేలు చేసి పట్టాలివ్వకపోవడం వల్ల అన్యాక్రాంతం చేసేందుకు అనేకమంది ప్రయత్నించడం బాధాకరమని అన్నారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదిక సర్వేలు జరిపి డి-పట్టాలు మంజూరు చేయాలని, లేకుంటే కుడుమూరు భూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా ప్రజలను, ప్రజాసంఘాలను కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ఈరోజు నుంచి ఈనెల 25 వరకు మూడు రోజులు పాదయాత్రలు కొనసాగుతాయని, అనంతరం ఈనెల 28న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపడతామని, కావున కలెక్టర్, రెవెన్యూ అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని, మంత్రి సంధ్యారాణి స్పందించి గిరిజనులకు పట్టాల పంపిణీ విషయంపై జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసి పరిష్కరించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయ కులు సూర్రు రామారావు మాట్లాడుతూ 48 సర్వేనెంబర్‌లోని 782 ఎకరాలు కబ్జా చేయాలని అనేక మంది కుట్ర పన్నుతున్నారని, దీన్ని గిరిజనులంతా ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర కుడుమూరులో ప్రారంభమై తోకమెట్ట, మెట్టవలస, ఒడిశాల, మడ, చీడివలస, ఇప్పలవలస, వేటగానివలస మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో కుడుమూరు భూ పోరాట కమిటీ నాయకులు సుర్రు గంగయ్య, కొర్ర శ్రీనివాసరావు, గెమ్మెల గోపాల్, భీమారావు, మాదల జమ్మరాజు, తాడియ్య, సేవి రామయ్య, సేబి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



గ్రామాల్లో పాదయాత్ర చేస్తున్న గిరిజన సంఘం నాయకులు



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న పిఒ అశుతోష్ శ్రీవాస్తవ

గృహాలు వెంటనే ప్రారంభించాలి : పిఒ

ప్రజాశక్తి - కురుపాం

పార్వతీపురం ఐడిడిఎ పరిధిలోని పిఎం జన్‌మన్ కింద ప్రారంభించని గృహ నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. మండలంలోని నేరేడువలస, మరియు తోటగూడ పంచాయతీల్లో నిర్మిస్తున్న పీఎం జన్ మన్ గృహాలను పిఒ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇంకా ప్రారంభం కాని ఇళ్లను వెంటనే ప్రారంభించాలని అన్నారు. అలాగే నిర్మాణంలో ఉన్న ఇళ్లు పూర్తయ్యేలా లబ్ధిదారులను మోటివేట్ చేయాలని సంబంధిత హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. లబ్ధిదారులందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన నిధులు అందేలా చూస్తామని చెప్పారు. ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమామహేశ్వరి, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, హౌసింగ్, సంబంధిత సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి

పెదభోగిలి సచివాలయాన్ని సందర్శించిన ప్రత్యేకాధికారి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదబోగిలిలో గల 1,2 సచివాలయాలను మండల ప్రత్యేక అధికారి ఎం.రాజేశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డులు దరఖాస్తులు, ఇతరత్రా పెండింగు ఉండే దరఖాస్తులను పరిశీలించి వాటిని పూర్తిచేయాలని, సచివాలయాల్లో ఎటువంటి దరఖాస్తులు పెండింగ్లో ఉండకూడదని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక తీసుకున్న కొత్త రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరు దరఖాస్తులను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంఎస్ ఎల్ఎన్ ప్రసాద్, సిఎస్‌డిటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

తోటపల్లి సుందరీకరణ పనులు చేపట్టాలి : పిఒ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి రిజర్వాయర్ వద్ద గల ఐటిడిఎ పార్క్ సుందరీకరణకు సంబంధించిన పనులు చేపట్టాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఐటిడిఎ పార్క్ దగ్గర షాపుల నిర్మాణాన్ని పిఒ శుక్రవారం పరిశీలించారు. వాటిని త్వరగా పూర్తి చేయాలని, పార్కు సుందరీకరణకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను పిఒ ఆదేశించారు. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్శనలో ఐటిడిఎ ఎఇ జి.తిరుపతిరావు, పార్క్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపురంలో కిశోర వికాసం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సీతారాంపురంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో కిశోర వికాసం కార్యక్రమం గరుగుబిల్లి సెక్టార్ సూపర్వైజర్ రౌతు లక్ష్మి ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య ఆవశ్యకతను ప్రతి ఆడపిల్ల తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. రక్తహీనత నివారణే ధ్యేయంగా గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెల పెంపకందార్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెల, మేకల పెంపకందారుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కన్వీనర్ రండి అచ్యుతరావు, మండల నాయకులు బూర అప్పచ్చి, నమ్మి శంకరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మక్కువ మండలం కోన వద్ద వై.పోలయ్య అనే గొర్రెలకాపరి మంద నుంచి ఇంటికి వస్తుండగా వడదెబ్బతో మృతి చెందడం ఆ కుటుంబం అనాథైందని, కావును ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలలు, పాము కాట్లుతో మరణించిన వారి కుటుంబాలకు పరిహారం రూ.10 లక్షల వరకు పరిహారం చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. వర్షాకాలంలో మేకలు, గొర్రెలు జబ్బులకు గురవుతున్నాయని, వీటికి మందులు సరఫరా చేసి ఆదుకోవాలని కోరారు.

రవిని అభినందించిన కేంద్రమంత్రి

ప్రజాశక్తి - సీతంపేట

గౌహతి ఐఐటి నుంచి పిహెచ్‌డి పట్టా పొందిన గేదెల రవిని కేంద్ర పౌరవిమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభినందించారు. బయోసైన్సెస్ అండ్ బయోఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ గేదెల రవి ప్రొఫెసర్ వెంకట దాసు వీరంకి, ప్రొఫెసర్ కన్నన్ పాక్షిరాజన్ సంయుక్త పర్యవేక్షణలో "రోడోటోరుల ముసిలాజినోసా అనే ఒలియేజినస్ ఈస్ట్ ద్వారా లిపిడ్లు, కెరోటినాయిడ్లు,బీటా కెరోటిన్ ఉత్పత్తి"పై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారు.

పిచ్చి మొక్కలు తొలగింపు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని చిట్టిపూడివలస గ్రామ పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉపాధ్యాయులు సాకేటి రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రస్తుతం పాఠశాలలు వేసవి సెలవులు సందర్భంగా మూతపడ్డాయి. అయితే ఇక్కడే విధులు నిర్వహించిన సాకేటి రాంబాబు నడుకూరు పాఠశాలకు బదిలీ అయినప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రుల కోరిక మేరకు ఆ గ్రామానికి వెళ్లి విద్యార్థులకు బోధన చేస్తున్నారు. ఇందులో భాగంగానే పాఠశాల ఆవరణంలో పెరిగిపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు.

వట్టిగెడ్డకు జలకళ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శుక్రవారం వట్టిగెడ్డలో జల కళకళలాడింది. నిన్నటి వరకు నీరు లేక ఎండిపోయిన ఒట్టిగెడ్డ నేడు నీటితో పుష్కలంగా ఉండడంతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రజకులు, పాడి రైతులు నీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఎగువప్రాంతంలో వర్షాలు పడడంతో వట్టి గడ్డలో నీరు ప్రవహిస్తుంది.



ఒట్టిగెడ్డలో చేరిన వరద నీరు

పంతాలకు పోయి పట్టణాభివృద్ధిని పక్కన పెడతారా?

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

అధికార తెలుగుదేశం, మున్సిపల్ పాలకవర్గ వైసిపి మధ్య నెలకొన్న విభేదాలతో పట్టణ అభివృద్ధి కుంటుపడుతున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు విమర్శించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, డ్రైనేజీ కాలువలు శిథిలావస్థకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మున్సిపల్ బడ్జెట్ సమావేశాల్లోనైనా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడతారని ఆశించామని, కానీ ఆ ఆశలు అడియాశలయ్యాయని విమర్శించారు. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కారానికి పాలకవర్గం చర్చించకుండా అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రజా ప్రతినిధులు వ్యక్తిగత దూషణలకు, ఘర్షణలకు దిగి మున్సిపల్ సాధారణ సమావేశం అర్థాంతరంగా వాయిదాకు కారణమయ్యారని విమర్శించారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమణలకు గురయ్యాయని, ఈ సమస్యలపై సిపిఎం ఇప్పటికే అనేక దఫాలుగా అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్థలాలు, చెరువుల ఆక్రమణలపై సమగ్రమైన దర్యాప్తు జరిపి నిజమైన పేదలకు నివాస స్థలాల కేటాయించాలని, అనర్హుల నుంచి ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ బడ్జెట్ అంతా చిల్లర ఖర్చులకేనా?

మున్సిపల్ బడ్జెట్ కేటాయింపుల్లో పట్టణ ప్రజల మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత శూన్యమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి వి రమణ విమర్శించారు. పట్టణ ప్రజల నుంచి ఏడాదికి రూ.12 కోట్లు వరకు పన్నుల రూపంలో వసూలు చేస్తున్నారని, కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లతో కలిపి బడ్జెట్ రూ.41 కోట్లుగా ప్రతిపాదించారని, ఈ ప్రతిపాదనలలో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలైన మంచినీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం, ట్రాఫిక్ నియంత్రణ నిమిత్తం కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణం, విద్యుత్ వ్యవస్థ మెరుగు వంటి వాటికి కేటాయింపులు శూన్యమని విమర్శించారు.. ఇప్పటికైనా అధికార, ప్రతిపక్ష పార్టీలు పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు పట్టణంలో ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలు, చెరువుల వివరాలతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు రెడ్డి శ్రీదేవి, పి.రాజశేఖర్, నాయకులు జి.కృష్ణ, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు



తాళం వేసి ఉన్న వ్యవసాయశాఖ అధికారి కార్యాలయం

వ్యవసాయశాఖ కార్యాలయానికి తాళం తీసేదెప్పుడో ?

రైతులకు అందుబాటులో లేని సేవలు

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయానికి ఎప్పుడూ తాళం వేసే ఉంటుందని పలువురు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ మేరకు శుక్రవారం 'ప్రజాశక్తి' వ్యవసాయ అధికారి కార్యాలయానికి 12.15 నిమిషాలకు వెళ్లేసరికి తాళాలు వేసే ఉన్నాయి. కార్యాలయ ఉనికి తెలిపే బోర్డు కూడా లేకపోవడం గమనార్హం. వ్యవసాయ కార్యాలయానికి తాళం వేసి ఉండడంపై చుట్టుపక్కల కార్యాలయాల సిబ్బందిని అడిగితే వ్యవసాయ శాఖాధికారి ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియదని పలువురు చెబుతున్నారు. రైతులకు అందుబాటులో ఉండాల్సిన వ్యవసాయ అధికారి, సిబ్బంది లేకపోవడంతో కార్యాలయానికి వివిధ పనులపై వచ్చే రైతులు అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారి లేకపోయినప్పటికీ సిబ్బంది అయినా కార్యాలయంలో అందుబాటులో ఉండాలని, కార్యాలయానికి వచ్చే రైతుల సందేహాలను నివృత్తి చేయాల్సిన వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. వ్యవసాయా ధారిత మండలంలో వ్యవసాయాధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా ఉండటం సమంజసం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుందని, ముందస్తుగా రైతులకు సలహాలు, సూచనలు అందించాల్సిన వ్యవసాయ అధికారులు కానరాకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వ్యవసాయాధికారి, సిబ్బంది పనితీరుపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఇదే విషయమై వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మల జ్యోతిని వివరణ కోరగా కార్యాలయ వేళల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో వలసబల్లేరులో జరుగుతున్న అసిరి పెద్దబంగారమ్మ తల్లి అమ్మవారి పండగ సందర్భంగా శుక్రవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెకు డప్పు వాయిద్యాలతో స్వాగతం పలుకుతూ అమ్మవారి గుడి వద్దకు తీసుకెళ్లాగా అసిరిపెద్దబంగారమ్మ తల్లిని దర్శించుకుని పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలంతా చల్లగా, సుఖసంతోషాలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టిడిపి నాయకులు బి.కడాయి, స్థానిక నాయకులు, యువత మహిళలు పాల్గొన్నారు.



మక్కువలో తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న ఎండియు ఆపరేటర్లు

అర్థాంతరంగా వీధిన పడేశారు!

ఉపాధి చూపించి ఆదుకోవాలి

ఎండియు ఆపరేటర్ల ఆందోళన

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల పాటు తమతో అగ్రిమెంట్ ఉన్నప్పటికీ అర్థాంతరంగా తమను పొమ్మంటూ వీధిన పడేశారని ఎండియు ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఆపరేటర్లు,హెల్పర్లు శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. కరోనా వంటి కష్ట కాలంలోనూ ప్రజలకు తమ వాహనాల ద్వారా సేవలందించడం జరిగిందని, అలాగే విజయవాడ వరద బాధితులకు కూడా 1200 వాహనాలు సేవలందించాయని వారు అన్నారు. తమకు ప్రభుత్వం, బ్యాంకుల నుంచి ఎలాంటి క్లియరెన్స్ ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తొలగింపుతో వీధిన పడిన తమ కుటుంబాలకు ఉపాధి చూపించాలని వారి డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక తహశీల్దార్ షేక్ ఇబ్రహీంకు వినతి పత్రం అందజేశారు. ఎండియూ ఆపరేటర్ల విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తెలియజేస్తామని తహశీల్దార్ తెలిపారు.

సాలూరు రూరల్: ఎండియు వాహనాలను కొనసాగించాలని ఎండియు ఆపరేటర్ల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎండియు ఆపరేటర్ల సంఘం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు మాట్లాడుతూ ప్రజలకు నేరుగా సేవలందించేందుకు ఉపయోగపడుతున్న ఎండియు వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం పౌర సేవలకు అంతరాయం కలిగించడమేన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఎండియు ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎండి యు ఆపరేటర్ల సంఘ సభ్యులు సంతోష్, కేశవ, రాజేష్, రాంబాబు, లక్ష్మణ, మురళి, సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.



కోటిపాం బ్రిడ్జిపై గోతుల వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, ప్రయాణికులు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?

వంతెనపై గోతులు కప్పాలంటూ సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి కొమరాడ

వంతెనపై గోతులు పూడ్చి రోడ్డేయండి అంటూ శుక్రవారం జంఝావతి నదిపై నిర్మించిన కోటిపాం వంతెన వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వినూత్నరీతిలో కోటిపాం బ్రిడ్జి పై ఉన్న గోతుల్లో నిల్వ ఉన్న వరద నీటిలో స్నానం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో రహదారి పైన గోతులా సిగ్గు సిగ్గు అంటూ నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ పాలకులు సంక్రాంతికి ముందు అన్న మాటలు ఇప్పటికీ గుర్తుకు రావా? అని ప్రశ్నించారు. అలాగే పార్వతీపురం నుండి కూనేరు వరకు మూడు రాష్ట్రాలకు వెళ్లే రహదారి మార్గంలో గోతులు కప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అటు అధికారులు ఇటు కూటమి ప్రభుత్వం స్పందించి ఈనెల 31నాటికి పార్వతీపురం నుండి కూనేరు వరకు మూడు రాష్ట్రాల కెళ్లే రహదారి మార్గంలో గల బ్రిడ్జిపైన ఉన్న గోతులను పూర్తి చేసి అటు వాహనదారులు ఇటు ప్రయాణికులు ప్రాణాలు కాపాడాలని కోరారు. లేకుంటే జూన్ 1 తర్వాత కోటిపాం బ్రిడ్జి వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి శివ నాయుడు ప్రయాణికులు పాల్గొన్నారు.

శరవేగంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సాలూరు

శ్యామలాంబ పండగ ముగిసిన నేపథ్యంలో పట్టణంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు మున్సిపల్ కమిషనర్ డిటివి కృష్ణారావు తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పర్యవేక్షణలో పట్టణంలో సుమారు 150 మెట్రిక్ టన్నుల పైబడి చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించినట్టు తెలిపారు. ఈ చెత్తను తరలించేందుకు 9 ట్రాక్టర్లు, రెండు జెసిబిలు, కాంపాక్టర్ వాహనాన్ని వినియోగించినట్టు తెలిపారు. చెత్త తరలింపులో 119 ప్రజారోగ్య సిబ్బంది, మేస్త్రీలు, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని గొటివాడకు చెందిన తిమ్మక శ్రీనివాస్ (40) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం శ్రీనివాస్ గురువారం గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా బంధువులు వెంటనే స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్వతీపురం - నారాయణపురం మధ్య బస్సు నడపాలి

ప్రజాశక్తి - బలిజిపేట

పార్వతీపురం వయా పెద్దింపేట, గౌరీపురం మీదుగా నారాయణపురం, బలిజిపేట వరకు బస్సు సర్వీసు నడపాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు యమ్మల మన్మధరావు మాట్లాడుతూ గౌరీపురం- నారాయణపురం మధ్య సువర్ణముఖీ నదిపై బ్రిడ్జి, రోడ్డు పనులు పూర్తయినందున బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. బస్సు సౌకర్యం లేక బలిజిపేట మండలం సుమారు 60 వేలు ప్రజానీకం బొబ్బిలి మీదుగా 50 కిలోమీటర్లు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. కావున నారాయణపురం నుండి పార్వతీపురానికి కేవలం 32 కిలోమీటర్లలో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు, పైగా కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి బ్రిడ్జి, రోడ్డు పనులు చేయించారని అన్నారు.పార్వతీపురం నుండి వయా పెద్దింపేట, గౌరీపురం మీదగా నారాయణపురం, బలిజిపేట బస్సు నడపాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు బొద్దాన భానుమూర్తి, అల్లాడి కృష్ణ, గంట్యాడ బలరామనాయుడు, దన్నాన తిర్నాథ, రామారావు, ఆటో యూనియన్ నాయకులు మధు, రవి, ఆనందు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డును బాగు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

ప్రభుత్వ కార్యాలయాలు సముదాయం (గర్ల్స్ ఆర్.సి.యం పాఠశాల)కు రాకపోకలు సాగించాలంటే పడవ ఉండాల్సిందేనని కాంగ్రెస్ నాయకులు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, తీళ్ళ గౌరీ శంకరరావు, గేదెల రామకృష్ణ తదితరులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయ సముదాయాన్ని శుక్రవారం పరిశీలించారు. కార్యాలయానికి రాకపోకలు సాగించే రహదారులు పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాటి నిండా వర్షపు నీరు నిల్వ ఉండి బురదగా మారడంతో అధికారులు, సిబ్బంది, కార్యాలయాలకు వచ్చిన ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సుమారు 20 కార్యాలయాలు ఉండే సముదాయానికి రాకపోకలు సాగించేందుకు రహదారి సదుపాయం లేకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే రహదారిలో గోతులు పూడ్చాలని కోరారు.

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతన ఒప్పందం జరగాలి

ప్రజాశక్తి పాలకొండ

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం ఒప్పందం జరగాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు అన్నారు. శుక్రవారం జరిగిన శ్రీ కోట దుర్గ మార్కెట్ కళాసీ యూనియన్ (సిఐటియు) కమిటీ సమావేశంలో ఆయన రమణారావు మాట్లాడారు. పాలకొండలో సిమెంటు, ఐరన్ కిరాణా, కాయగూరలు తదితర హోల్ సేల్ షాపుల్లో పనిచేస్తున్న కార్మికులకు, యాజమాన్యాలకు 2019లో పీస్ రేటు వేతన ఒప్పందం 2022 వరకు అమల్లో ఉండేలా అంగీకారం కుదిరిందని తెలిపారు. అప్పుడు జరిగిన వేతన ఒప్పందం కూడా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పీస్ రేటు వేతనం ఒప్పందం లేదన్నారు. 2022లో కార్మికులు, యాజమాన్యాలు నూతన వేతన ఒప్పందం జరగాల్సి ఉండగా యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా నేటికీ ఒప్పందం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యాలు, కార్మిక సంఘాలతో సామరస్యంగా చర్చలు జరుపుకొని పీస్ రేటు వేతన ఒప్పందం జరగాల్సిన అవసరం ఉందని సమావేశం ద్వారా యాజమాన్యానికి విజ్ఞప్తి చేస్తున్నట్లు చెప్పారు. మార్కెట్ కళాసి సిఐటియు అనుబంధ సంస్థగా యూనియన్ ఏర్పాటు చేసుకున్న శ్రీ కోట దుర్గ మార్కెట్ కళాసి యూనియన్ అధ్యక్షులు జాగ గోవిందరావు అధ్యక్షతన మార్కెట్ కళాసి యూనియన్ (సిఐటియు) ఏర్పడిన తర్వాత మొదట కమిటీ సమావేశంలో పలు సమస్యలు చర్చించి కార్మికుల జనరల్ బాడీలో డిమాండ్లు రూపొందించి యాజమాన్యాలకు ఇవ్వాలని కమిటీ తీర్మానించింది. సమావేశంలో డి.గంగరాజు, కె.అప్పన్న, కె.త్రినాధ్, టి.చిన్న అప్పలనాయుడు, బి రాము, డి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు ఫారం పాండ్స్ లక్ష్యాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఉపాధిహామీ ద్వారా చేపడుతున్న ఫారం పాండ్స్ లక్ష్యాలు ఈనెలాకు 31 నాటికి పూర్తి చేయాలని డ్వామా పీడీ రామచంద్రరావు ఆదేశించారు. శుక్రవారం సీతంపేట, భామిని మండలాల ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1050, భామిని మండలంలో 845 నీటి కుండీలు లక్ష్యం ఇచ్చామని, తప్పనిసరిగా ఈ లక్ష్యాన్ని పూర్తి చేయకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సాంకేతిక సమస్యలుంటే వెంటనే పరిష్కరించుకొని లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపిడిఒ బివి మిశ్రో, ఎపిడి డి.శ్రీహరి, ఎపిఒలు సాగర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ రైతు ప్రకృతి సాగు చేపట్టాలి

ప్రజాశక్తి - పాచిపెంట

ప్రతి రైతు తమకున్న వ్యవసాయ భూమిలో కనీసం 15శాతమైనా సరే ప్రకృతి సాగు చేపట్టాలని ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ రైతులకు పిలుపునిచ్చారు. మండలంలోని తాడూరులో సిఆర్‌పి తిరుపతి నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామస్థాయి ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యంతో పాటుగా కుటుంబ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రైతులు డి.రాము, డి శంకరరావును శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కత్తెర పురుగు, ఇతర పురుగుల నివారణకు అవసరమైన అగ్ని అస్త్రాన్ని రైతు దండుపాటి రాము ద్వారా తయారు చేయించి చూపించారు. కార్యక్రమంలో ఎఒ కె.తిరుపతిరావు , విఎఎ దినేష్ కుమార్, ఎల్ వన్ సూర్యారావు, ఐసిఆర్‌పి కుమార్ పాల్గొన్నారు.

యోగాపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం : యోగాపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని మండల మండల ప్రత్యేక అధికారి ఆర్.కృష్ణవేణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు గ్రామాల్లో యోగా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించాలన్నారు. వీటికి పీడీ, పిఇటిలను నియమించేందుకు అధికారులు బాధ్యత వహించాలన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలన్నారు. గృహ నిర్మాణాలు ప్రారంభిస్తే తక్షణమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపైన దృష్టి పెట్టాలన్నారు. వ్యాధుల ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతంలో రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ, తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ, ఎస్సై జి కళాధర్, వైద్యాధికారి బి ప్రదీప్ కుమార్, డిప్యూటీ ఎంపీడీవో టి వెంకటరమణమూర్తి, ఎఒ డి.వెంకటరమణ, వెలుగు, ఉపాధి, విద్య, ట్రాన్స్కో ,ఐసిడిఎస్, శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీతంపేట : యోగాంధ్రాను గ్రామ, మండల స్థాయిలో పగడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి జి.చినబాబు అన్నారు. స్థానిక మండల ప్రజా పరషత్ కార్యాలయంలో మండల స్థాయి సెక్టోరియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు జూన్ 21 వరకు నిర్వహించాలన్నారు. వీటిలో ఉల్లాసంగా ఉత్సాహంగా అన్ని అధికారులు సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఇలాంటి కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ ఈ కార్యక్రమం అన్ని చోట్లా జరగాలని చెప్పారు. సమావేశంలో ఎంపిడిఒ మిశ్రో, సిడిపిఒ పి.రంగలక్ష్మి, వైద్యాధికారులు భాను ప్రతాప్, చాందిని, సత్యవేణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక మండల్ పరిషత్ కార్యాలయంలో యోగా ఆంధ్రా మండల కమిటీ ఏర్పాటు చేవారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎంఎస్ఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 21 నుంచి వచ్చే జూన్ 21 వరకు యోగాంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని గ్రామ సచివాలయాల్లో నిర్వహించాలన్నారు. యోగా నేర్చుకున్న వారి పేర్లు రిజిస్ట్రేషన్ చేసి వారికి 21లో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని, ఇది అన్ని సచివాలయాల్లోనూ జరగాలని అన్నారు. కార్యక్రమం ముందుకు తీసుకువెళ్లేందుకు మండల స్థాయి అధికారులంతా ఈ కమిటీ సభ్యులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కెకె కుమార్ వర్మ, ఎపిఎం ఆర్.శ్రీరాములు నాయుడు, అంగన్వాడీ సూపర్వైజర్లతో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

కురుపాం : యోగా మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడుతుందని ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగా యొక్క ప్రాముఖ్యతను సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం యోగసనాలను వేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వై.వెంకటనాయుడు, కార్యాలయ ఎఒ నాగభూషణ్ కార్యాలయ, ఉపాది హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.